క్లుప్తంగా

30 వరకు పొగాకు చూర కొనుగోలు


వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఈ నెల 30వ తేదీ వరకు పొగాకు చూర కొనుగోలు చేస్తామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం టంగుటూరు, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 921 చూర బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 866 కొనుగోలయ్యాయి. 55 చూర బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.195, కనిష్ట ధర రూ.50, సరాసరి ధర రూ.127.36 పలికింది. వేలంలో మొత్తం 20 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఈ-క్రాప్‌తో రైతులకు ప్రయోజనం


ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఓ

టంగుటూరు: రైతులు తాము వేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. టంగుటూరులో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పంట నమోదు చేసుకుంటేనే నష్టపరిహారం, ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో తూర్పువైపు ఉన్న చెరువుకట్ట వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేసి వారిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,070 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఉపాధి కూలీపై అడవి పంది దాడి

కందుకూరు రూరల్: ఉపాధి కూలీలపై అడవి పంది దాడి చేసింది. ఈ ఘటన మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామ పరిధిలోని పంట కాలువ వద్ద జరిగింది. శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు రోజులాగే పంట కాలువలో పనికి వెళ్లారు. పని చేస్తున్న సమయంలో కాలువ గడ్డి పొదల్లో నుంచి ఒక్కసారిగా వచ్చిన పంది టి.అంకమ్మ అనే కూలీపై దాడి చేసింది. దీంతో కాలును పట్టుకొని గాయం చేసింది. తోటి కూలీలు ఆమెను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాలుకి తీవ్ర గాయం కావడంతో కుట్లు పడినట్లు వైద్యులు తెలిపారు.

52 మందికి వైద్య పరీక్షలు


నల్లగండ్లలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను గ్రామాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు సక్రమంగా వినియోగించుకోవాలని డాక్టర్ మూరక ప్రతాపురెడ్డి అన్నారు. సోమవారం నల్లగండ్లలో ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. శిబిరంలో 52 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేటి నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

గిద్దలూరు రూరల్: అరుణాచలం పుణ్యక్షేత్రానికి గిద్దలూరు నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ రాత్రి ఇక్కడి నుంచి బయల్దేరి 30వ తేదీ నాటికి కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని అక్కడి నుంచి అరుణాచలం చేరుకుంటారని చెప్పారు. బస్సుకు పోను రాను రూ.2,500 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 96765 66935 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీలోని సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

థ్యాంక్యూ ఎమ్మెల్యే సార్..!

- నిన్న లింగన్నకుంట, లక్ష్మక్క పల్లికి, నేడు తుమ్మగుంటకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు
- విద్యార్థుల్లో ఆనందం


గ్రామంలో ఆర్టీసీ బస్సు వద్ద సంతోషం వ్యక్తం చేస్తున్న తుమ్మగుంట విద్యార్థులు, స్థానికులు


బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న తుమ్మగుంట విద్యార్థులు

కనిగిరి రూరల్: మండలంలోని తుమ్మగుంట పంచాయతీకి చెందిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని తుమ్మగుంట పంచాయతి పరిధిలో సుమారు నాలుగు గ్రామాలున్నాయి. ప్రధాన రోడ్డుకు దగ్గరగా ఉన్న ఈ పంచాయతీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు, ప్రధానంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఆటో్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో వ్యయ ప్రయాసలతో పాటు, ప్రమాదాలకు గురౌతున్నారు. తుమ్మగుంట, కాశీపురం, నడింపల్లి, శ్రీ రంగాపురం గ్రామాల నుంచి ప్రతి రోజు సుమారు 55 మందికి పైగా విద్యార్థులు కనిగిరిలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో చదివేందుకు వస్తుంటారు. ఆటో రాక పోయినా.. వచ్చినా ఆటో నిండుకుని ఉన్నా.. ప్రమాదం అని తెలిసినా.. స్కూల్ సమయం అవుతుందనే భయంతో ఆటోలో తప్పనిసరి ప్రయాణం చేస్తున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు పడుతున్న సమస్యను సర్పంచ్, గ్రామస్తులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బుర్రా ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది కల్గకుండా ఉదయం సాయంత్రం, ఆర్టీసీ బస్సు తుమ్మగుంట పంచాయతి మీదుగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈమేరకు సోమవారం గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే బుర్రా ప్రత్యేక కృతజ్ఞతలు – ఇండ్లా రత్తమ్మ(సర్పంచ్, తుమ్మగుంట)

మా పంచాయతికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిపించడం ఎంతో సంతోషంగా ఉంది. ఎంతో కాలం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బస్సు మా గ్రామానికి వస్తోందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం: ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ

సౌకర్యార్థం కనిగిరి, పీసీపల్లి మండలాల్లో రెండు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. గత నెల రోజు క్రితం పీసీపల్లి మండలంలోని గుంటుపల్లి, లక్ష్మక్క పల్లి, లింగనపాలెం నుంచి ఇర్లపాడు వయా బోట్లగూడూరు మీదుగా ఆర్టీసీ బస్సును ఉదయం సాయంత్రం ఏర్పాటు చేశాం. ప్రతి రోజు సుమారు 70 మంది విద్యార్థులు బస్సును సద్వినియోగం చేసుకుంటున్నారు. తాజాగా సోమవారం కనిగిరి మండలం తుమ్మగుంట పంచాయతీకి బస్సు ఏర్పాటు చేశాం. సుమారు 50 మంది విద్యార్థులు బస్సును సద్వినియోగం చేసుకున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిపులను ఆర్టీసీ బస్సును నడిపేందుకు చర్యలు తీసుకున్నాం.

వెంకటనారాయణ భావజాలం ఆచరణీయం


వెంకటనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కందుకూరు: దళిత బహుజన నాయకుడు కట్టా వెంకట నారాయణ భావజాలం నేటి యువతకు ఆచనీయమని మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావుమాదిగ అన్నారు. పట్టణానికి చెందిన దళిత నాయకుడు కట్టా వెంకటనారాయణ 9వ వర్ధంతి సభ సోమవారం స్థానిక విజయ బాలాజీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. కనకారావుమాదిగ మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే భావజాలంతో సమాజంలో మార్పు కోసం కృషి చేశారని, దళితబహుజన పక్షాల నిలబడిన స్నేహశీలి అని కొనియాడారు. వెంకటనారాయణతో కలిసి అనేక ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దళిత మహాసభ రాష్ట్ర నాయకుడు నూకతోటి బాబూరావు, జాషువా సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిశోర్, దళిత నాయకులు బి.వెంకటేశ్వర్లు, గేరా చిరంజీవి, వీవీ శేషయ్య, పాలడుగు రమేష్, పాలేటి కోటేశ్వరరావు, ఎద్దు శశికాంత్‌భూషణం, అల్లు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 3 అర్జీలు

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్.హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌కు రెండు అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఓటరు సర్వే నూరుశాతం పూర్తి

సింగరాయకొండ: మండలంలో ఓటరు సర్వే నూరు శాతం పూర్తయినట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. ఈ సర్వేలో మరణించినవారు 2,091 మందిని గుర్తించామని, కొత్త ఓటర్లు 719 మంది, ఓటరు కార్డులో తప్పుల సవరణ కోసం 2,383 మంది నమోదు చేసుకున్నారని, వీటిపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఫారం 7 నమోదు చేస్తామని తహసీల్దార్ ఓ ప్రకటనలో వివరించారు.

జువ్వలగుంట చెరువు గండి పూడ్చాలి


జువ్వలగుంట చెరువుకు పడిన గండి

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని జువ్వలగుంట చెరువు గండి పూడ్చాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చెరువుకు పాలేరు–బిట్రగుంట సప్లయ్ చానల్ ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అధికారికంగా, అనధికారికంగా సుమారు 50 ఎకరాల ఆయకట్టు ఉంది. వాస్తవానికి రైల్వే మూడో లైను అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ చెరువు కట్టను రైల్వే అధికారులు తెగ్గొట్టారు. చెరువు స్థలం రైల్వే పరిధిలోకి వస్తుందని ప్రస్తుతం చేస్తున్న పనులు పూర్తయితే తప్ప చెరువు కట్ట గండి పూడ్చటానికి వీల్లేదని రైల్వే అధికారులు తెలియజేస్తున్నారు. ఆయకట్టు రైతులు మాత్రం రెండేళ్లగా చెరువుకట్ట గండి కారణంగా పంటలు పండటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ శాఖ డీఈ కె.చెరియన్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో రైల్వే అధికారులతో సమావేశం ఉందని, రైల్వే పరిధిలోకి వచ్చే చెరువులపై చర్చిస్తామన్నారు. త్వరలోనే చెరువు గండి సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉలవపాడు: ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరికి ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయరహదారి పై ఉలవపాడు -రాజుపాలెం జంక్షన్ మధ్య సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులోని ముంగమూరు డొంకకు చెందిన ఆత్మకూరి కిశోర్, మోహన్‌లు ద్విచక్రవాహనం పై కావలి నుంచి ఒంగోలు వెళుతున్నారు. రాజుపాలెం దాటిన వెంటనే వాహనం కిందపడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా లేక వారే పడిపోయారే అనే విషయం తెలియరాలేదు. క్షతగాత్రులను ఉలవపాడు 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు


విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయానికి మవారం పలువురు భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందించారు. వీరిలో నాగినేని ఈశ్వరవరప్రసాదరావు, ఉమామహేశ్వరరావు దంపతులు రూ. 50,116, కొల్లూరి సుబ్బరాములు, వెంకటరమణమ్మలు రూ 31,116, ఆకుతోట శ్రీనివాసరావు రూ. 25వేలు, సాదినేని మనోహకర్, సుకన్య దంపతులు రూ. 6,250, సుధీర్‌కుమార్, దివ్యలు రూ. 6,250, శిగా ప్రసాద్, మంజుల రూ.6,250, ఇస్కాల రాజారావు, సత్యవతి రూ.6,250, కృష్ణమూర్తి, కోటేశ్వరమ్మ రూ.6250, రెడ్డిమాసు గోపీకృష్ణ, ఈశ్వరి రూ.6250, వజ్జల పద్మావతి సుబ్రమణ్యం రూ.1116, రామడుగు శ్యామ్‌బాబు, విశాల రూ.5,116లు, పోనూరి శ్రీనివాసరెడ్డి, అనుపమలు రూ. 5,116 విరాళంగా అందించారు.

పరిశుభ్రతతోనే విద్యార్థులకు మంచి ఆరోగ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైస్ చైర్మన్ పులి శాంతి

కనిగిరి రూరల్: పరిశుభ్రతతోనే విద్యార్థులకు మంచి ఆరోగ్యం లభిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక 18వ వార్డులోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత, స్వచ్ఛత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పులి శాంతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రతి విద్యార్థి చేతులు శుభ్రం చేసుకున్న తర్వాతే భోజనం లేదా, ఆహార పదార్థాలను తినాలని తెలిపారు. మదర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌కే షరీఫ్, శానిటరీ సెక్రటరీ మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


అధ్యాపకులతో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే నాణ్యమైన, ఉన్నత మైన విద్య లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు నాక్ కమిటీ త్వరలో పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉషారాణి, అధ్యాపకులు సైన్స్ కోర్సుల ఆవశ్యకత గురించి వివరించారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంతో సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్‌లు డాక్టర్ బాల కృష్ణా, మాలకొండయ్య, జయకుమారి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమేష్ బాబు, గుడ్ హెల్ప్ సంస్థ ప్రతినిధి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

మర్రిపూడి: మండలంలోని సచివాలయాల పరిధిలో ఉన్న బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పాలని ఎంపీడీఓ బ్రహ్మయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం డ్రాప్‌గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 18 మంది డ్రాపౌట్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్ల సహకారంతో సర్వే చేసి బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల నుంచి బడి వదిలి వెళ్లిన విద్యార్థులను గుర్తించి జాబితా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎంవీ రంగయ్య, వెల్ఫేర్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్పందనకు 28 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 28 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 18, కొనకనమిట్ల నుంచి 3, హెచ్‌ఎంపాడు 2, వెలిగండ్ల 2, కురిచేడు 1, మర్రిపుడి 1, సీఎస్‌పురం నుంచి ఒక అర్జీ ఆర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు స్పందన వీఆర్వో రఘు రామయ్య తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ టి. అజయ్‌కుమార్ అన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టంగుటూరు: మండలంలోని అనంతవరం ఎస్సీ కాలనీలోని ఎలిమెంటరీ పాఠశాలలో పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులను గ్రామానికి చెందిన కసుకుర్తి వెంకట్రావు(బాస్), పారిశ్రామికవేత్తలు డి.సురేంద్రబాబు, కేఎస్ రమేష్‌బాబు, ఈదుమూడి మాజీ సర్పంచ్ కె.వెంకట్రావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పుస్తకాలు మాత్రమే పంపిణీ చేసేవారమని, విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది ప్లేట్లు, గ్లాసులు అందిచామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ మిడసల బాలకోటయ్య, శారీ మందిర్ వెంకటేశ్వర్లు, కసుకుర్తి శ్యాంబాబు పాల్గొన్నారు.

పెన్షన్ రీ వెరిఫికేషన్ పూర్తి

పామూరు: మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 247 పెన్షన్లు రీ వెరిఫికేషన్ కోసం రాగా వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. అర్హులైన వారికి సెప్టెంబర్ 1న పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


గృహ సారథుల బీమా రిజిస్ట్రేషన్‌లో మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్, జేసీఎస్ కన్వీనర్

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న గృహ సారథుల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 10 వార్డులోని సచివాలయ పరిధిలోని గృహ సారథులకు జీవిత బీమా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంలో గృహ సారతులు కీలకంగా వ్యవహరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గృహ సారథుల శ్రేయస్సు కోసం బీమా సౌకర్యం కలిపించినట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి పద్మ, జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కన్వీనర్లు దాసరి మురళీ, ఎస్ఎస్ రసూల్, గృహ సారథులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన

పట్టణంలోని బొగ్గుల గొంది కాలనీ, ఎస్టీ కాలనీల్లో విద్యా హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్మన్ గఫార్ మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, మంద్రు రమేష్, నవకుమార్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

జరుగుమల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జరుగుమల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కంచుకొండ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందన వనం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఎస్ చంద్రశేఖర్, అనిత, భారతి, స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ వివరాలు యాప్‌లో నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: నూరుశాతం డ్రాపౌట్స్ వివరాలు యాప్‌లో ఈ నెల 4వ తేదీ లోగా సీఆర్ యాప్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.సుకుమార్ జీఈఆర్ సర్వేపై ఎంఈఓలు, సీఆర్‌పీలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. మరణించిన వారి వివరాలు సేకరించాలన్నారు. 18 ఏళ్ల లోపు లోపు పిల్లలందరి వివరాలు నమోదు చేయాలన్నారు. వలంటీర్లు, సీఆర్‌పీలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి జీఈఆర్ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు దాసుప్రసాద్, డి.రామిరెడ్డి, సీఆర్‌పీలు కొండల రాయుడు, రమణయ్య, రవి, మధు, హనోక్‌లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


పోట్లూరు నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

గుడ్లూరు: మండలంలోని తెట్టు, మోచర్ల, పోట్లూరు, గుడ్లూరు గ్రామాల్లోని చెరువుల్లో జరిగిన ఉపాధి హామీ పనులను ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర బృందం సభ్యులు సోమవారం తనిఖీ చేశారు. కేంద్ర రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ సంజయ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్లు రుషి సిన్హా, జాగృతి రాయ్‌లు పనులకు సంబంధించిన రికార్డులను, కొలతలు, మెజర్‌మెంట్, మస్టర్లను పరిశీలించారు. కూలీలతో కూలి నగదు సకాలంలో పడుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సాగు చేస్తున్న జామ తోటలు, తెట్టులో బ్లాక్ ప్లాంటేషన్ మొక్కలను, పోట్లూరులో నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. రికార్డులు నిర్వహణ, జరుగుతున్న పనులు పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. వారి వెంట ఏపీడీ సంజీవరావు, ఎంపీడీఓ చంద్రసేన్, ఈసీ వెంకటేశ్వర్లు, ఏపీఓ అబ్దుల్లా, టెక్నికల్ అసిస్టెంట్‌లు హరినారాయణ, చిన్నయ్య, మహేష్, ఫీల్డు అసిస్టెంట్ బ్రహ్మయ్య ఉన్నారు.

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు

- హైవే పై అధికారుల పరిశీలన


కరేడు ర్యాంపు వద్ద హైవే వద్ద పరిశీలిస్తున్న అధికారులు

ఉలవపాడు: జాతీయరహదారిపై మండల పరిధిలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారించవచ్చని అధికారుల బృందం సోమవారం పలు చోట్ల పరిశీలించారు. కందుకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీ, కందుకూరు సీఐ నఫీజ్‌బాషా, ఎస్సై బాజిరెడ్డితో పాటు హైవే అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే చోట స్పీడ్ బ్రేకర్లు, తక్కువ ప్రమాదాలు జరిగే చోట మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని, హైవే అధికారులు పోలీసు శాఖ వీటిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని కరేడు ర్యాంపు, ఉలవపాడు బైపాస్, రాజుపాలెం జంక్షన్, చాగల్లు, వీరేపల్లి జంక్షన్ ప్రాంతాలను పరిశీలించారు. హైవేపై ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లింగసముద్రం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మండలంలోని వీఆర్ కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com